



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం డిసెంబర్ 20 2024 | సంపుటి :0 | సంచిక : 72 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# ఓఆర్ఆర్ లీజు టెండర్లపై సిట్ దర్యాప్తు: సీఎం రేవంత్‌రెడ్డి



**ఔటర్ రింగ్ రోడ్డును ఆయాచితంగా అప్పనంగా ఎవరికో అప్పగించారని, టెండర్లపై విచారణ జరిపించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు.**

హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డును ఆయాచితంగా అప్పనంగా ఎవరికో అప్పగించారని, టెండర్లపై విచారణ జరిపించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. సిట్‌తో సమగ్ర దర్యాప్తు చేయిస్తామని స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజుపై విచారణ జరపాలని హరీశ్‌రావు కోరటం అభినందనీయమన్నారు. సిట్ విచారణను స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

“హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా రాణించడానికి కారణం.. కృష్ణా-గోదావరి నదీ జలాలు, ఓఆర్ఆర్, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు, ఐటీ, ఫార్మా కంపెనీలు, శాంతిభద్రతలను కాపాడటం, మత సామరస్యాన్ని పెంపొందించడం. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతుందంటే అందుకు కారణం కాంగ్రెస్సే. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగింది. వైఎస్ఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయింది. కాంగ్రెస్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాల వల్లే ఆదాయం పెరిగింది. ఎన్నికల ముంగిట ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వటంపై రాష్ట్రంలో తీవ్ర చర్చ జరిగింది. ఔటర్ రింగ్‌రోడ్డు లీజు టెండర్లపై విచారణ జరిపించేందుకు సిట్ ఏర్పాటు చేస్తాం” అని సీఎం తెలిపారు.

## ఫార్ములా - ఈ కార్ రేసింగ్‌పై చర్చకు రెడీ.. రేవంత్ సర్కార్‌కు తేల్చిచెప్పిన కేటీఆర్

- ఫార్ములా - ఈ కార్ రేసులో కేసు నమోదుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శాసనసభ వేదికగా స్పందించారు.
- ఫార్ములా - ఈ కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చకు పెడితే.. సమాధానం చెప్పేందుకు రెడీగా ఉన్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు.



శాసనసభ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా మిమ్మల్ని, ప్రభుత్వాన్ని కోరుతున్నాను. నిజంగా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే చిత్తశుద్ధి ఉంటే, ఈ రేసులో ఏదో కుంభకోణం జరిగిందని అంటున్నారు కదా..? దాని మీద చర్చ పెట్టండి. మొత్తం సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏ1గా, ఐఏఎస్ ఆఫీసర్ అరవింద్ కుమార్‌ను ఏ2గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఓ ప్రయివేటు కంపెనీ సీఈవో బీఎల్ఎన్ రెడ్డిని కూడా నిందితుల జాబితాలో చేర్చారు ఏసీబీ అధికారులు.

2లో

## అసెంబ్లీలో మాటల యుద్ధం.. స్పీకర్ క్షమాపణ ఎందుకు చెబుతారు?:

- తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి.
- సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని విపక్షాలు అసహనం వ్యక్తం చేశాయి.
- శాసనసభ నడుపుతున్న తీరుపై విపక్షాలు ఆక్షేపించాయి.
- సమాచారం లేకుండా ఆర్థిక పరిస్థితిపై చర్చ పెట్టారని విమర్శించాయి.



హైదరాబాద్: శాసనసభ నిబంధనల ప్రకారం సభ నిర్వహించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్.. స్పీకర్ దృష్టికి తెచ్చారు. శాసనసభ నడిపే తీరు ఇది కాదని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సభ్యులకు సమాచారం లేకుండా ఎలా మాట్లాడతారని భాజపా పక్షనేత మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విపక్ష, అధికార సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సభలో గందరగోళం నెలకొంది.

## కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



2లో

హైదరాబాద్: కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలన్నారు. రాజ్యాంగ నిర్మాతను భాజపా అవమానిస్తే భారాస ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు రెండేళ్లలో పూర్తి: మంత్రి ఉత్తమ్



2లో

హైదరాబాద్: బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు భూసేకరణకు రూ.37 కోట్లు విడుదల చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ వారంలో మరో రూ.22 కోట్లు విడుదల చేస్తామన్నారు.

## చర్లపల్లి జైలు నుంచి విడుదలైన పట్నం నరేందర్ రెడ్డి




హైదరాబాద్ : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి చర్లపల్లి జైలు నుంచి గురువారం రాత్రి విడుదల అయ్యారు. జైలు నుంచి విడుదలైన పట్నం నరేందర్ రెడ్డికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఇక పట్నం నరేందర్ రెడ్డి విజయ సంకేతం చూపుతూ.. పార్టీ కేడర్‌లో జోష్ నింపారు.

వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి చేశారన్న అభియోగాల కేసులోఅరెస్టయి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు 24 మంది రైతులకు నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. నవంబర్ 11న ఫార్మా విలేజ్ పేరుతో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్ల వెళ్లారు. కార్యక్రమాన్ని రైతులు అడ్డుకున్నారు. రైతులు తమపై దాడి చేశారంటూ కొందరు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేరోజు అర్ధరాత్రి పోలీసులు ఐదు గ్రామాల్లో దొరికిన వారిని దొరికినట్టుగా అరెస్టు చేశారు.

ఆనాటి నుంచి ఆ 5 గ్రామాలు నిర్మానుష్యంగా మారి, బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. నాంపల్లి స్పెషల్ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేయడంతో బాధితులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. ఎట్టకేలకు న్యాయం గెలిచిందని, ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని రోటిబండతండా, పులిచెర్లకుంటతండా, లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు సంబురాలు చేసుకున్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు, కోస్గి పట్టణాల్లో బీఆర్ఎస్ నాయకులు రోడ్లపైకి చేరి పటాకులు కాల్చారు.

## నేను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం: హరీశ్‌రావు



- కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సంవత్సరమే రూ.1.25 లక్షల కోట్ల అప్పు చేసిందని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు.
- తాను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు.
- రాష్ట్ర రుణాలపై శాసనసభలో జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడారు.

## అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేక.. కేటీఆర్‌పై రేవంత్ సర్కార్ అక్రమ కేసు : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసుల డ్రామాను తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేయడం రాజకీయ అమాయకత్వం తప్ప మరొకటి కాదు అని కవిత పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దయచేసి తెలుసుకోండి.. మేము కేసీఆర్ సైనికులం. తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టింది. మీ చిల్లర వ్యూహాలు మమ్మల్ని భయపెట్టవు.. అవి మా సంకల్పానికి మరింత బలం చేకూరుస్తాయి. పోరాటం మాకు కొత్త కాదు అక్రమ కేసులతో మా గొంతులను నొక్కలేరు.. జై తెలంగాణ ! జై జై తెలంగాణ !! అని కవిత పేర్కొన్నారు.

# సంపాదకీయం

## కలికాలం! ఇది కృత్రిమ మేధ యుగం!!

బీబీసీ కథనం ప్రకారం భారత సంతతికి చెందిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ అనే యువ శాస్త్రవేత్త, కృత్రిమ మేధస్సుకు చెందిన 'ఓపెన్ ఏఐ' సంస్థ పరిశోధకుడిగా పనిచేస్తూ, 'విజిల్ బ్లోయర్'గా మారిన నేపథ్యంలో, శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో హతాన్మరణం చెందాడని తెలుస్తోంది. 'ఓపెన్ ఏఐ కృత్రిమ మేధస్సు సంస్థ' అనుసరిస్తున్న ఆక్షేపణీయ విధానాలను ఆయన బహిరంగంగా విమర్శించడమే బహుశా ఆయన 'బలవన్మరణానికి' దారితీసి ఉండవచ్చని మీడియా వర్గాల అభిప్రాయం. కొన్నాళ్ల క్రితం సుచిర్‌తో 'న్యూయార్క్ టైమ్స్' జరిపిన ఇంటర్వ్యూలో, కృత్రిమ మేధస్సుకు సంబంధించి ఆయన తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించారు. ఈ సాంకేతికత వల్ల సమాజానికి వాటిల్లే ప్రమాదాలపై తన ఆందోళనను బహిరంగంగా వ్యక్తం చేశారు.

కాపీరైట్ చట్టం కింద పరిగణించాల్సిన సమాచారాన్ని, 'ఓపెన్ ఏఐ సంస్థ' చట్టవిరుద్ధంగా, విచ్చలవిడిగా అనైతికంగా, అక్రమంగా, అసురక్షితంగా, మోసపూరితంగా, ఉపయోగించడాన్ని సుచిర్ తప్పుబడుతూ, తీవ్రంగా విమర్శించారు. 'చాట్‌జీపీటీ' లాంటి కృత్రిమ మేధస్సు ఏజెంట్లు, అంతర్జాలాన్ని హానికరంగా మార్చివేస్తున్నాయని ఆయన సుస్పష్టం చేశారు. లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, సుచిర్ బాలాజీ, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదివాడు. నవంబర్ 2020 నుంచి ఆగస్టు 2024 వరకు, నాలుగేళ్లపాటు 'ఓపెన్‌ఏఐ సంస్థ'లో పనిచేశారు. సుచిర్ బాలాజీ ధర్మాగ్రహం వర్తమానంలో, సమీప భవిష్యత్తులో 'కృత్రిమ మేధస్సు' కలిగించే 'హానికర ఫలితాల' సంకేతమని నిస్సందేహంగా చెప్పవచ్చు. 'అధికారం, ఆధిపత్యం, అభివృద్ధి' అనే అసంబద్ధమైన నెపంతో, నేడు అధునాతన సాంకేతికతల నిపుణులు తమ శక్తి-యుక్తులు ఉపయోగించి, సృష్టించిన ఒక వికారమైన విజ్ఞానానికి 'కృత్రిమ మేధస్సు (ఏఐ)' అనే నాగరిక నామకరణం చేశారు. అయితే, దీని సంతానం, తరచుగా, వారికి తెలియకుండా, హద్దులు మీరి, పగ్గాలు విదిలించుకుని, వారి నియంత్రణకు అతీతంగా మారాయి, మారుతున్నాయి, భవిష్యత్తులో మారనున్నాయి.

అశోకుడు కళింగ యుద్ధం బీభత్సాన్ని చూసి శాంతి మార్గం అనుసరించాడు, బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. రాబర్ట్ ఓపెన్‌హైమర్ అణుబాంబు అనివార్య దుష్ఫలితాలను సహించలేకపోయాడు. కృత్రిమ మేధ సృష్టికర్తలలో ఒకరైన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆ వినూత్న సాంకేతికత అనియంత్రిత ఆవిష్కరణల ప్రమాదాలపై ప్రపంచాన్ని గట్టిగా హెచ్చరిస్తున్నారు. బహుశా సుచిర్ బాలాజీ కూడా అదే ప్రయత్నం చేసి మృత్యుబారిన పడ్డాడేమో? కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామి శాస్త్రవేత్తలు జెఫ్రీ హింటన్, డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్, జాన్ హాప్‌ఫీల్డ్ 2024 సంవత్సరానికి గాను, నోబెల్ బహుమతులు పొందినవారిలో ఉన్నారు.

హింటన్, హాప్‌ఫీల్డ్‌లు తమ కృషి ద్వారా 'గణిత, భౌతిక శాస్త్రాల' మధ్య ఒక వంతెనగా కృత్రిమ మేధస్సును సృష్టించారు. దీనివల్ల తాత్త్విక అన్వేషణకు, వ్యావహారిక ప్రయోగాలకు, కావాల్సిన ఉపకరణాల రూపకల్పన జరిగింది. అలాగే డెమిస్ హసాబిస్, జాన్ జంపర్ 'ఆల్ఫాఫోల్డ్' అనే ఏఐ వ్యవస్థ రూపకల్పన చేసి అభివృద్ధి పరిచారు. ఇది ప్రోటీన్ నిర్మాణాలను విశ్లేషించడంలో గణనీయమైన రీతిలో, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. అమినో ఆమ్లక్రమాల ఆధారంగా ప్రోటీన్‌లో పరమాణు నిర్మాణాన్ని కనుగొనే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇది జీవ, వైద్య శాస్త్రరంగాల్లో విప్లవాత్మక ఫలితాలను చూపింది. ముఖ్యంగా ఔషధాల అభివృద్ధి వేగవంతం చేయడం, రోగాలను అణు స్థాయిలో అర్థం చేసుకోవడం, యాంటీబయోటిక్ నిరోధకత వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో సహాయపడింది.

'ఏఐ డీప్‌లెర్నింగ్ గాడ్‌ఫాదర్'గా పిలవబడే జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, జాన్ హాప్‌ఫీల్డ్‌తో కలసి 'న్యూరల్ నెట్‌వర్క్‌'ను రూపొందించారు, ఇది 'బ్యాక్‌ప్రొపగేషన్ అల్గారిథమ్' అనే విశిష్ట ప్రక్రియ ద్వారా తప్పుల నుండి నేర్చుకోవడం సాధ్యమైంది. దీని ద్వారా ఆధునిక డీప్‌లెర్నింగ్‌కి బలమైన పునాది ఏర్పడింది. ఈ ఆవిష్కరణ కంప్యూటర్ విజన్ నుండి భాషా ప్రక్రియల వరకు వివిధ ఏఐ అనువర్తనాల్లో ప్రధాన పాత్ర పోషించింది. ఇంగ్లాండ్‌లో జన్మించిన హింటన్, ఎడింబరో విశ్వవిద్యాలయానికి సమర్పించిన పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసంలో 'న్యూరల్ నెట్‌వర్క్‌లో ఎర్రర్ కరెక్టింగ్ కోడ్స్, డిస్ట్రిబ్యూటెడ్ రిప్రజెంటేషన్స్'పై దృష్టిపెట్టారు. ఆయన ఆధారభూత పనితనం కృత్రిమ మేధస్సు దిశను పూర్తిగా మార్చివేసింది. నోబెల్ బహుమతి అందుకున్నప్పటికీ, హింటన్ నిరంతరం ఏఐతో సంభావ్య భావి ప్రమాదాల గురించి హెచ్చరిస్తూ వస్తున్నారు.

2023లో గూగుల్‌ను వదిలి, హింటన్ 'అనియంత్రిత కృత్రిమ మేధస్సు అభివృద్ధి' కలిగించే ప్రమాదాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి, మానవాళికి కలిగే ముప్పు గురించి తన ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేశారు. హింటన్, హాప్‌ఫీల్డ్‌లకు లభించిన గుర్తింపు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పలురంగాల్లో మార్గదర్శక ప్రభావాన్ని చూపిస్తుంది. డీప్‌లెర్నింగ్ ప్రధాన భూమికలైన సిద్ధాంతపరమైన అల్గారిథమిక్ మౌలికాలను హింటన్, హాప్‌ఫీల్డ్‌లు అందించగా, హస్సాబిస్, జంపర్‌లు శాస్త్రీయ సవాళ్లను పరిష్కరించగల కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని శాస్త్రీయంగా రూఢిపరుస్తూ నిరూపించారు. ఈ విజయాలు కృత్రిమ మేధస్సు ద్వంద్వ స్వభావాన్ని కూడా పునరుద్ఘాటించాయి. సమాజానికి కలిగించే ప్రయోజనాలు చాలా ఉన్నప్పటికీ, దాని నైతిక, తదితర అస్తిత్వసంబంధ సమస్యలు గణనీయమైనవిగా మిగిలిపోతున్నాయి.

## రాహుల్‌పై ఆరోపణలు.. అమిత్‌షాను కాపాడేయత్నం: ప్రియాంక గాంధీ

రాహుల్ గాంధీ తోయడం వల్లే తమ ఎంపీలు గాయపడ్డారని భాజపా చేసిన ఆరోపణలపై ప్రియాంక స్పందించారు.

దిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ను కాపాడుకునేందుకే తన సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ పై ఆరోపణలు చేస్తున్నారంటూ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో రాహుల్ గాంధీ తోయడం వల్లే తమ ఇద్దరు ఎంపీలు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రియాంక స్పందించారు.

"డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను పట్టుకొని, జై భీమ్ అని నినాదాలు చేస్తూ శాంతియుతంగా పార్లమెంట్‌లోకి ప్రవేశిస్తున్నారు. లోపలికి వెళ్లకుండా ఆయన్ను ఎవరు ఆపారో మీరు చూడొచ్చు. మేం చాలారోజులుగా నిరసనలు చేస్తున్నాం. ఈ రోజు వారు ఆందోళనకు దిగారు. అప్పుడే ఈ తోపులాటలు, గుండాగిరీ చోటుచేసుకుంది. అమిత్‌షాజీని కాపాడుకునేందుకు ఈ యత్నాలు మొదలుపెట్టారు.

పార్లమెంట్‌లో భాజపా ఎంపీలకు తీవ్ర గాయాలు.. రాహుల్‌గాంధీ నెట్టేశారంటూ ఆరోపణలు

రాహుల్ ఎవరినో తోశారంటూ ఆరోపణలు చేస్తున్నారు. నా కళ్లముందు ఖర్గేజీని తోశారు. ఆయన నేలపై పడిపోయారు. తర్వాత సీపీఎం ఎంపీని నెడితే.. ఆయన ఖర్గేజీపై పడిపోయారు. ఇదంతా ఒక కుట్ర. వారి నిజమైన సెంటిమెంట్ ఈ రోజు బయటపడింది. 'జై భీమ్' అని నినాదాలు చేయాలంటూ వారికి నేను సవాలు విసురుతున్నాను" అని ప్రియాంక మీడియాతో మాట్లాడారు.




పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేద్కర్ ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం ఎంపీలు కూడా నిరసన చేపట్టారు. ఇరువర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాజపాకు చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. రాహుల్ తోయడం వల్లే వారు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తోంది.

## ముంబయి మారణహోమం.. నిందితుడి పిటిషన్‌పై న్యాయస్థానానికి అమెరికా విజ్ఞప్తి

**ముంబయి ఉగ్రదాడిలో కీలక నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టును అమెరికా ప్రభుత్వం కోరింది.**

వాషింగ్టన్: దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో భీకర ఉగ్రదాడి తలుచుకుంటే ఇప్పటికీ వణుకు పుడుతుంది. నాటి ఘటనలో కీలక నిందితుడైన తహవూర్ రాణా.. తనను భారత్‌కు అప్పగించాలన్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ గతంలో అమెరికా సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. అతడి పిటిషన్‌ను కొట్టివేయాలంటూ న్యాయస్థానాన్ని తాజాగా అమెరికా ప్రభుత్వం కోరింది.

తహవూర్ రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబయి దాడుల కేసులో కీలక నిందితుడు. ప్రస్తుతం లాస్ ఏంజెల్స్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అమెరికాలో ఉన్న ఇతడిని తమకు అప్పగించాలంటూ అక్కడి ప్రభుత్వాన్ని భారత్ కోరుతోంది. తనను భారత్‌కు అప్పగించకూడదని కోరుతూ వివిధ ఫెడరల్ కోర్టులను ఆశ్రయించినా అతడికి నిరాశే మిగిలింది. చివరి ప్రయత్నంగా గతంలో అమెరికా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇక్కడా ఓడిపోతే తహవూర్‌ను భారత్‌కు అప్పగించే అవకాశాలు మరింత పెరుగుతాయి.

ఈ క్రమంలోనే స్పందించిన అమెరికా ప్రభుత్వం.. అతడు దాఖలు చేసిన పిటిషన్ కొట్టేయాలంటూ కోర్టును అభ్యర్థించింది. కాగా.. పాకిస్థాన్ ఉగ్రవాదులు నవంబర్ 26, 2008 సాయంత్రం కొలాబా సముద్రతీరం నుంచి ముంబయికి చేరుకొన్నారు. ఆ తర్వాత బృందాలుగా విడిపోయిన ఉగ్రవాదులు అత్యంత రద్దీగా ఉండే ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ రైల్వే స్టేషన్‌లోకి చొరబడ్డారు. వెంటనే వారి చేతుల్లో ఉన్న ఏకే-47 తుపాకులను తీసి తూటాల వర్షం కురిపించారు. అక్కడ కన్పించిన వారినల్లా పిట్టల్లా కాల్చి చంపారు.

**మహిళపై 72 మంది అత్యాచారం.. మాజీ భర్తే దోషి**

ఊహించని ఘటనలతో వణికిపోయిన అక్కడి ప్రజలు భయంతో పరుగులు తీశారు. పోలీసులు అక్కడకు చేరుకునేలోపే దాదాపు 58 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన ఉగ్రవాదులు వీధుల్లోకి వచ్చి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఇలా వరుసగా 12 చోట్ల ఏకధాటిగా కాల్పులు, బాంబుల మోత మోగింది. దాదాపు 60 గంటల పాటు సాగిన ఆ మారణహోమంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 18 మంది భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. మృతుల్లో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు.

## జమ్ము కశ్మీర్‌లో ఉగ్రఘటనలు.. అమిత్‌షా ఉన్నతస్థాయి సమీక్ష

దిల్లీ: జమ్ముకశ్మీర్‌లో భద్రతపై హోం మంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ, పారామిలటరీ ఉన్నతాధికారులు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత అమిత్‌షా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి. 2025లో చేపట్టాల్సిన భద్రత అంశాలపై అమిత్‌షా అధికారులతో కూలంకషంగా చర్చించినట్లు తెలుస్తోంది.

జమ్ముకశ్మీర్ వ్యాప్తంగా అక్కడక్కడా ఉగ్రవాద ఘటనలు చోటు చేసుకుంటున్న తరుణంలో ఈ సమీక్షకు ప్రాధాన్యత ఏర్పడింది. అక్టోబరు 20న సెంట్రల్ కశ్మీర్‌లో చోటు చేసుకున్న ఉగ్రదాడిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు కూడా కశ్మీర్‌లోయ చుట్టుపక్కల ఉగ్ర ఘటనలు వెలుగుచూశాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఉగ్రకార్యకలాపాలను అణిచి వేయడానికి



చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ఈ సమావేశంలో అమిత్‌షా చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జమ్ముకశ్మీర్‌లో సుమారు 45 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.

## 'ఆయన వల్ల అసౌకర్యానికి గురయ్యా': రాహుల్‌పై మహిళా ఎంపీ ఆరోపణలు

దిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో అధికార, ప్రతిపక్ష ఎంపీలు చేపట్టిన నిరసనలు గందరగోళానికి దారి తీశాయి. ఈ నేపథ్యంలోనే నాగాలాండ్‌కు చెందిన భాజపా మహిళా ఎంపీ ఫంగ్నోన్ కొన్యాక్ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రాంగణంలో ఆయన తనను అసౌకర్యానికి గురి చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు."ప్లకార్డు పట్టుకుని శాంతియుతంగా మేము నిరసన తెలుపుతున్నాం. అదే సమయంలో రాహుల్ గాంధీ నాకు సమీపంగా వచ్చారు. అంతేకాకుండా.. ఆయన నాపై అరిచారు. అనుచితంగా ప్రవర్తించారు. ఒక మహిళగా ఎంతో అసౌకర్యానికి గురయ్యా. చాలా బాధగా అనిపించింది. ఆయన తీరుతో పక్కకు తప్పుకున్నా. కానీ, పార్లమెంట్ సభ్యుడిగా ఆయన ఈ విధంగా ప్రవర్తించి ఉండకూడదు" అని భాజపా ఎంపీ పేర్కొన్నారు. దీనిపై రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు ఫిర్యాదు చేశారు.కాంగ్రెస్ మహిళా ఎంపీల ఫిర్యాదులు "రాహుల్ గాంధీ చర్యలతో నా గౌరవానికి, ఆత్మ విశ్వాసానికి తీవ్ర గాయమైంది. ఆదివాసీ వర్గానికి చెందిన సభ్యురాలినైనా నాకు మీరే రక్షణ కల్పించాలి" అని కోరారు. మరోవైపు, ప్రాంగణంలో జరిగిన ఘటనలో అధికార పక్షం ఎంపీల కారణంగా తమకూ గాయాలు అయ్యాయంటూ కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్లకు చేరుకున్నారు. కాగా.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టగా.. మరోవైపు, అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం ఎంపీలు కూడా నిరసన చేశారు. ఎంపీల ఆందోళనతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే.

## నేను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి



కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సంవత్సరమే రూ.1.25 లక్షల కోట్ల అప్పు చేసిందని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు.

హైదరాబాద్: "భూములు కుదువపెట్టి అప్పులు తీసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.75 కోట్లకు ఎకరం చొప్పున టీజీఐఐసీ భూములు అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. భారాస ప్రభుత్వం కూడా మెస్ ఛార్జీలు పెంచింది. వ్యవసాయ యంత్ర పరికరాలకు రాయితీ నిధులు ఇచ్చాం. ఈ ప్రభుత్వం తొలి ఏడాదే రూ.1.25 లక్షల కోట్ల అప్పు చేసింది. ఈ లెక్కన అప్పులు చేస్తే ఐదేళ్లలోనే గత ప్రభుత్వ అప్పును మించిపోతారు. మేం పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పు చేస్తే.. వీళ్ల అప్పు ఐదేళ్లలోనే రూ.7 లక్షల కోట్లు దాటిపోతుంది. రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం పరంగా చూస్తే.. మేం కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రాన్నే అప్పగించాం. రూ.2.93 లక్షల కోట్ల బడ్జెట్‌తో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగించాం. రాష్ట్ర సొంత ఆదాయం రూ.35 వేల కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు పెంచాం. కరోనా వల్ల, కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా రాష్ట్రానికి ఆదాయం తగ్గింది. ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రంపై కొంత అప్పుల భారం పడింది" అని హరీశ్‌రావు వివరించారు.

## అసెంబ్లీలో మాటల యుద్ధం.. స్పీకర్ క్షమాపణ ఎందుకు చెబుతారు?:

మొదటిపేజీ తరువాయి

విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సభ నిర్వహణలో కొంత సమాచార లోపం జరిగింది... దీనికే స్పీకర్ సారీ చెబుతారా? అని మండిపడ్డారు. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

"హరీశ్‌రావు, అక్బరుద్దీన్.. ఇద్దరూ సీనియర్ సభ్యులు. సమాచార లోపం జరిగిందని మేమే చెబుతున్నాం. అయినా క్షమాపణ చెప్పాలంటున్నారు. వారు ఏదైనా చెప్పాలనుకుంటే రిక్వెస్ట్ చేయాలి. అంతేకానీ హుకుం జారీ చేయొద్దు. తప్పు చేస్తే తప్పకుండా క్షమాపణ చెబుతాం. ఎంతో ముఖ్యమైన అంశంపై సభలో చర్చ కొనసాగుతుండగా.. చర్చను పక్కదారి పట్టించేందుకే ఇదంతా చేస్తున్నారు. సభ సజావుగా జరగాలని భారాస నేతలు భావించడం లేదు. ప్రభుత్వ పరంగా ఏదైనా పొరపాటు జరిగితే శాసనసభ వ్యవహారాల మంత్రిగా నేను బాధ్యత తీసుకుంటా.. జవాబుదారీగా ఉంటా. అంతేకానీ స్పీకర్ క్షమాపణ చెప్పాలంటే.. ఎలా సాధ్యం అవుతుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి

అంబేద్కర్‌పై భాజపా వైఖరిని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి , బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారంలో భారాస వైఖరి ఏంటని ప్రశ్నించారు.

అంతకుముందు అసెంబ్లీ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు రెండేళ్లలో పూర్తి: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

శాసనసభలో ఆయన మాట్లాడారు.

అన్ని ప్రాజెక్టులను పద్ధతి ప్రకారం పూర్తి చేస్తున్నట్లు ఉత్తమ్ చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. రెండేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కాస్ట్ బెనిఫిట్ రేషియో చూసుకుని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ కాల్వకు రూ.120 కోట్లు మంజూరు చేశామని.. త్వరలో టెండర్లు పిలుస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చిన భారాస

మరోవైపు భారాస సభ్యులు సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. సభ ఆమోదం పొందని భూ భారతి బిల్లును చట్టంగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. సభ్యుల హక్కులకు భంగం కలిగించేలా వ్యహరించారంటూ నోటీసులు ఇచ్చారు. శాసనసభ్యుల హక్కులను పరిరక్షించాలని సభాపతిని కోరారు.

## ఫార్ములా - ఈ కార్ రేసింగ్‌పై చర్చకు రెడీ.. రేవంత్ సర్కార్‌కు తేల్చిచెప్పిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్‌పై విచారణ జరిపేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇటీవల అనుమతించిన సంగతి తెలిసిందే. గవర్నర్ అనుమతితో తదుపరి చర్యలకు కాంగ్రెస్ సర్కార్ ఉపక్రమించింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని కేటీఆర్‌పై అభియోగం మోపారు. కేటీఆర్‌పై 4 సెక్షన్లు.. 13(1)ఏ, 13(2)పీసీ యాక్ట్, 409, 120బీ కింద కేసు నమోదు చేసింది ఏసీబీ.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం డిసెంబర్ 20 2024

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టిన అధికారులు



కరపత్రం బాన్సువాడ, డిసెంబర్,19

బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డ్ లో గురువారం మున్సిపల్ అధికారులు ప్రజాపాలన ఇచ్చిన దరఖాస్తులను అనుసరించి ఇందిరమ్మ ఇండ్ల సర్వే ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తుల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి వీర రెడ్డి,వార్డు అధికారి మణికంఠ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసిన దళిత సంఘ నాయకులు



కరపత్రం బాన్సువాడ, డిసెంబర్ 19

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను గురువారం బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో అంబేద్కర్ సంఘ సభ్యులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల చేత గెలిచిన కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నర్సింలు, మన్నె విట్టల్ ,మన్నె చిన్న సాయిలు, మహేష్, దిలీప్, రాజారామ్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హన్మజీపేట్ ను మండల కేంద్రంగా ప్రకటించాలి.. మాజీ ఎంపిటిసి సుధాకర్ రెడ్డి

కరపత్రం బాన్సువాడ డిసెంబర్ 19



గట్టు మీది ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయినా హాన్మాజిపేట్ మండల కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ స్పీకర్ స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కోనాపూర్, సంగోజిపేట్, హన్మజీపేట్, కాదులాపూర్, తదితర గ్రామాల ప్రజలకు గత ఎన్నికల్లో హన్మజీపేట్ మండల కేంద్రంగా ప్రకటిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారని, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా హన్మజీ పేట్ మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు. ఇటీవల రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ హనుమాజిపేట్ మండలం గా చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారని, ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఇద్దరు కలిసి శాసనసభ సమావేశాల్లోనే హన్మజీపేట్ మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. గట్టు మీది ప్రాంత ప్రజలకు రెవిన్యూ సేవలు, వైద్య సేవలు అందాలన్న బాన్సువాడ మండల కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని, రాష్ట్రంలో ఏ మండల కేంద్రంలో కూడా ఇంత దూరం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హన్మాజీపేట గ్రామానికి మండల కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పనిచేయాలన్నారు.

## అక్రమ కేసులతో మా గొంతులను నొక్కలేరు

– ఎక్స్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత...

కరపత్రం నిజామాబాద్, డిసెంబర్ 19 :



రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్ పార్టీ,కేసీఆర్ ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసుల డ్రామాను తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని,పోరాటం మాకు కొత్త కాదని అక్రమ కేసులతో మా గొంతులను నొక్కలేరని ఎక్స్ వేదికగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసుకొచ్చారు.గురువారం కేటీఆర్ తో ఉన్న ఫోటోని ఎమ్మెల్సీ కవిత ఎక్స్ లో షేర్ చేశారు.అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేయడం రాజకీయ అమాయకత్వం తప్ప మరొకటి కాదని సీఎం రేవంత్ రెడ్డి దయచేసి తెలుసుకోవాలన్నారు.మేము కేసీఆర్ కి సైనికులమని,తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టిందని మీ చిల్లర వ్యూహాలు మమ్మల్ని భయపెట్టవని మా సంకల్పానికి మరింత బలం చేకూరుస్తాయన్నారు.

# గురుకుల పాఠశాల కాదు పాముల పాఠశాల

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి
కోరుట్ల నియోజక వర్గం

జగిత్యాల జిల్లా మెటుపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ క్యాంప్ లో దశాబ్దాలుగా ప్రభుత్వ గురుకుల పాఠశాల నడుస్తున్నది.ఇది చాలా ప్రముఖ పాఠశాలగా గుర్తించబడింది.ఈ పాఠశాల తో పాటు తర్వాత కాలంలో జూనియర్ కళాశాలగా కూడా ఎదిగింది.ఈ పాఠశాలలో చదువుకున్నా వారెందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు.అయితే, ఈ గురుకుల పాఠశాలలో వరుస సంఘటనలు విద్యార్థులను, తల్లిదండ్రులను,ప్రజలను కలవరపెడుతున్నాయి.ఈ మధ్యన ఈ పాఠశాలలో పాము కాట్లు పెరిగిపోయాయి.వరుసగా 6 గురు విద్యార్థులు పాము కాట్లకు గురయ్యారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.గత బుధవారం రోజు రాత్రి ఓంకార్ అఖిల్ అనే విద్యార్థి పాము కాటుకు గురయ్యారని వైద్యులు తేల్చారు.నిన్న యశ్విత్ అనే విద్యార్థి పాము కాటుకు గరయ్యాడు.గత పదిరోజుల్లో పాముకాటుకు గురైన విద్యార్థుల్లో ఇద్దరు మరణించారు.మరో ఇద్దరు కోలుకుంటున్నారని సమాచారం.ఈ పాముకాట్లతో అధికారులు అప్రమత్తమయ్యారు. చేతిపైన కాటుకు గురైన విద్యార్థి రాత్రి అఖిల్ విపరీతమైన నొప్పితో



ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవీలత



బాధపడితే పాఠశాల సిబ్బంది స్థానిక ఆరోగ్య సహాయకుడిని పిలిచి చూపించారు.అతని సలహా మేరకు పాఠశాల సిబ్బంది కోరుట్ల లోని ప్రైవేట్ వైద్యుడి వద్దకు విద్యార్థిని తీసుకెళితే అది పాము కాటని చికిత్స ప్రారంభించాడు. తర్వాత విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.ఈ వార్త తెలియడంతో హాస్పిటల్ వద్ద పెద్దఎత్తున తల్లిదండ్రులు, జనం గుమికూడారు.విద్యాశాఖాధికారులు వచ్చి పరిస్థితిని తెలుసుకున్నారు. అయితే పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవీలత వీధుల్లో లేరని అధికారులు గుర్తించారు.గత రెండు మూడు రోజులుగా ప్రిన్సిపాల్ విధుల్లో లేరని,ఎలాంటి సమాచారం తెలపకుండా,అధికారుల అనుమతి లేకుండా డ్యూటీకి గైర్హాజరు అయ్యారని గుర్తించిన అధికారుల సమాచారంతో జిల్లా కలెక్టరు ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేసారు.ప్రస్తుత ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవీలత కూడా ఈ పాఠశాలలోనే చదివారు.ఈ వరుస సంఘటనలతో ఆగ్రహించిన ప్రజలు,విద్యార్థుల తల్లిదండ్రులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. దీనితో డిఎస్పి శ్రీ రాములు,జిల్లా అడిషనల్ కలెక్టర్ హామీతో గురుకుల పాఠశాల తల్లిదండ్రులు ధర్నా విరమించారు.ఈ ధర్నా ముగియగానే పాఠశాల ఉపాధ్యాయులు ధర్నా ప్రారంభించారు. ఉపాధ్యాయులను శిక్షిస్తూ బదిలీ చేస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయానికి నిరసనగా ఉపాధ్యాయులు జాతీయ రహదారిపై చేసిన ధర్నాతో మళ్లీ ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడి కోరుట్ల నుండి మెట్పల్లికి వచ్చే బస్సులు ఇతర గ్రామాల నుంచి తిరిగి వచ్చాయి.మొత్తానికి పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో జరిగిన పాముకాటు వ్యవహారాలు సంచలనంగా మారింది.

## మూడో కల్లు డిపో పున:ప్రారంభించాలి



కరపత్రం ,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 19 :

నగరంలోని మూడో కల్లు డిపో మూసి వేయడంతో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని,తమపై దయతలచి కల్లు డిపోను ప్రారంభించాలని గీత కార్మికులు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు గురువారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కల్లు డిపో మూసివేయడంతో 29 మంది కార్మికులు,200మంది సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కల్లు దుకాణాలనూ తెరిపించాలని కోరారు.

## సేంద్రియ వ్యవసాయ సాగుతో లాభాలు



కరపత్రం నిజామాబాద్, డిసెంబర్ 19 :

సేంద్రియ వ్యవసాయ సాగుతో ఎన్నో లాభాలు తెస్తుందని రాష్ట్ర ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు.నగరంలోని న్యాల్ కల్ రోడ్ లో సేంద్రియ సాగు చేస్తున్న ఆకుల పాపయ్య వ్యవసాయ క్షేత్రాన్ని కమిషన్ సభ్యుడు గడు గంగాధర్ ముదక్ పల్లి రైతులతో కలిసి సందర్శించారు.వ్యవసాయంలో రెట్టింపు లాభాలకు సేంద్రియ సాగు ఎంతో ఉపయోగపడుతుందని ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు కూడా లాభాలు తెచ్చిపెడతాయని అన్నారు.

## ప్రజలకు ఇబ్బందిగా కలగకుండా వాహనాలను పార్కింగ్ చేయాలి.. ఎస్సై అశోక్

కరపత్రం బాన్సువాడ, డిసెంబర్ 19



బాన్సువాడ పట్టణంలో వాహనదారులు తమ వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయకుండా పార్కింగ్ కొరకు మార్కు వేసిన దాంట్లోనే తమ వాహనాలు నిలపాలని ఎస్సై అశోక్ అన్నారు. గురువారం పట్టణంలోని రహదారికి ఇరువైపులా ఇష్ట రాజ్యాంగ పార్కింగ్ చేసిన వాహనదారులను ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు చేశారు. పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను తప్పనిసరి ఉంచుకోవాలని తనిఖీల సమయంలో పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ శంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పాఠశాల విద్యార్థులకు షీ టీమ్ పై అవగాహన...



కరపత్రం ,బోధన్ డిసెంబర్ 19..




బోధన్ డివిజన్ షీ టీమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాకాసిపేట్ లో గల ప్రభుత్వ పాఠశాలలో షీ టీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది విజయ్, సుజాత లు మహిళలపై జరిగే నేరాల గురించి టి-సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, జేజే చట్టం, సైబర్ నేరాల గురించి విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి...

కరపత్రం,బోధన్ డిసెంబర్19..

నేడు నిర్వహించే డయల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులు ఆర్టీసీ సంస్థకు ఏవైనా సలహాలు,సూచనలు చేయాలని అనుకునే వారు శుక్రవారం సాయంత్రం 4నుండి 5వరకు ఏర్పాటు చేయనున్న డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో 9959226001నంబర్ ను సంప్రదించాలని సూచించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ సంస్థకు తగు సలహాలు, సూచనలు అందించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ కోరారు.

## జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు రక్షిత

కరపత్రం నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 19 :




రాష్ట్ర నెట్ బాల్ సంఘం ఆదేశాలను మేరకు మహబూబాద్ జిల్లాలో 68వ అండర్ 19 రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలో పల్లపు రక్షిత రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జెడ్పిహెచ్ఎస్ సారంగాపూర్ హెచ్ఎం లలిత వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణంరాజు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ నిర్మల్ పోటీలకు తమ పాఠశాలలో నుంచి రక్షిత,తిరుమల,కావేరి,ఆర్తి,ప్రతిభ బాలుర విభాగంలో రాహుల్ కార్తీక్ లు సైతం పాల్గొని రాణించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా సారంగాపూర్ విలేజ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సుదర్శన్ హనుమంతు రక్షిత కు 4 వేల ప్రోత్సాహకంగా అందజేశారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రాధాకృష్ణ గోపాల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

# చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తం..ప్రణవ్.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ డిసెంబర్ 19...**

- రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం.



హుజురాబాద్ డివిజన్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు రైతులకు అందిస్తామని,కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని,రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఎస్సారెస్పీ పరిధిలో ఉన్నటువంటి రైతులకు జనవరి ఒకటి నుంచి సాగునీరు విడుదల చేస్తామని దానికి సంబంధించిన ప్రణాళికలను అధికారులు రూపొందించారని,ఈ విషయమై ఇప్పటికే అధికారులతో మాట్లాడమని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల విజ్ఞాన విహార యాత్రల కోసం ఆర్టీసీ వారి స్పెషల్ బస్సులు:...

- హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ ఠాగూర్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ డిసెంబర్ 19...**




ప్రభుత్వ విద్యాసంస్థలు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలకు మరియు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలకు అతి తక్కువ ఖర్చుతో టీజిస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి అని సూపర్ లగ్జరీ ఎక్స్ ప్రెస్ పల్లె వెలుగు వంటి బస్సు లు కెపాసిటీ బట్టి వినియోగించుకోవచ్చు. ఇట్టి అవకాశాన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీ బస్ లో ప్రయాణం సురక్షితం అని హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్స్: DM:9959225924,STI:9704833971, ఐలయ్య: 7382848235, చరణ్:9177324963

# లేడీస్ క్లబ్ మహిళలకు ఆటల పోటీలు

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 19**





సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక సి.ఎన్.సి.ఓ.ఎ క్లబ్ నందు మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలను లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.వీటిలో భాగంగా మహిళలకు బాల్ ఇన్ ద సర్కిల్, బాంబింగ్ ద సిటీ, రోలింగ్ బాల్ మొదలగు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం చాలా సంతోషమని,ఇలాంటి పోటీలను సింగరేణి సంస్థ గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు స్థానిక రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం నందు ఈనెల 23న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సింగరేణి దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయబడునని తెలియజేశారు. సింగరేణి దినోత్సవ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి హరిణి, లేడీస్ క్లబ్ కమిటి సభ్యులు కోమలి, ప్రసన్న, లావణ్య, సేవా కోఆర్డినేటర్ సుధాకర్, నిర్వాహకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పరిపాటి రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 19.**




వీణవంక మండలంలోని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్ రెడ్డి జన్మదినాన్ని వీణవంక మండల కేంద్రంలో బిఆర్ఎస్వి నాయకులు మ్యడగోని భరత్, రాపర్తి అరవింద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ...వీణవంక మండలంలోని వివిధ గ్రామాల్లో మరియు పోతిరెడ్డిపల్లి గ్రామంలోని ఎంతో మంది నిరుపేద కుటుంబాల విద్యార్థుల ఉన్నత చదువులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేస్తున్నారు. అని వా రి సేవలను కొనియాడారు.ఆ భగవంతుని ఆశిషులతో నిండు నూరేళ్ల పాటు సల్లగా ఉండాలని మనసారా కోరుకుంటు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు యార కుమార్, అంబాల శ్రావణ్, మిడిదొడ్డి సాయిరామ్, మిడిదొడ్డి సాయికుమార్, రాపర్తి అభిలాష్, రాపర్తి సాయి కృష్ణ ,మిడిదొడ్డి అభిలాష్, రాపర్తి నితిన్, అజయ్,వినయ్,యార అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా దేశద్రోహి....

- నిండు పార్లమెంట్లో అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు క్షమాపణ చెప్పాలి.
- బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సంజయ్ కుమార్ డిమాండ్..

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 19**



దేశ అత్యున్నతమైన నిండు పార్లమెంటులో కేంద్ర హోం శాఖ మంత్రి హోదాలో అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత, భరతరత్న, ఈ దేశంలోని 95% పీడిత ప్రజలకు చైతన్య మూర్తిగా, ప్రపంచ మేధావి అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ఉద్దేశించి కించపరిచే వ్యాఖ్యలు చేసిన వాక్యాలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, నిండు పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ కు పేద ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడారు. యావత్తు ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకున్న ప్రపంచ మేధావి, అంబేద్కర్ చేసిన సేవలు లేకుంటే ఈనాటి దేశం ఈ విధంగా ఉండేది కాదని, ప్రతి పౌరుడు అభివృద్ధి ,దేశ అభివృద్ధిని కాంక్షించిన బాబాసాహెబ్ ప్రతి పౌరుడికి హక్కులను పొందపరచడం అంబేద్కర్ చేసిన తప్పు, లేదా అంబేద్కర్ పీడిత వర్గాలకు చెందిన వాడు ఈ దేశంలోని అత్యున్నత విద్యావంతుడుగా ఎదగడం తప్పు, అంబేద్కర్ లాంటి మేధావి ఈ ప్రపంచంలో లేదని జ్ఞానానికి చిహ్నంగా, అంబేద్కర్ రచించడం తప్పు, ద ఇండియన్ రూపీ అండ్ ప్రాబ్లం అని పుస్తకాన్ని రాసి, భారతదేశ ఆర్థిక స్థితిగతులను మార్చిన కృషి అంబేద్కర్ తప్పు, రెవెన్యూ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు అంబేద్కర్ చేసిన కృషి తప్పు, ఏం తప్పు చేశాడని అంబేద్కర్ ని సాక్షాత్తు ఈనాటి హోం మంత్రిగా ఉన్న అమిత్ షా నిండు సభలో కించపరుస్తున్నాడో సమాధానం చెప్పాలని, అంబేద్కర్ ని కించరపరచడం వల్ల బిజెపి పార్టీ నైజం బయటపడిందని, మతం ముసుగులో రాజ్యాన్ని ఏలుతూ, మనువాదపు ఛాయల ప్రభుత్వాన్ని నడిపిస్తున్న అహంకార పాలకులు మోడీ ప్రభుత్వమేనని తప్పకుండా రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారని, సంజయ్ కుమార్ హెచ్చరించారు, అమిత్ షా వెంటనే తన అహంకారాన్ని తగ్గించుకొని అంబేద్కర్ ప్రతిమ కాళ్లకు నమస్కారం చేసి క్షమాపణ చెప్పాలని కోరారు, గతంలో అమిత్ షా కు నాయకుడైన మోడీ అంబేద్కర్ ప్రతిమ కాళ్లకు నమస్కారం చేసిన ఘటన మర్చిపోయారా అని అన్నారు.పేద ప్రజల మనోభావాలతో దెబ్బతీసిన అమిత్ షా దేశద్రోహి అని, అమిత్ షా ను జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.

# బిజెపి పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేయాలి..

- శంకరపట్నం మండలంలో పలు గ్రామాల బిజేపి బూత్ అధ్యక్షుల ఎన్నిక...
- పార్టీ ఎన్నికల అధికారి రాజేందర్...

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 19**







కేంద్రంలోని బిజెపి పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు బూత్ అధ్యక్షులు శక్తి కేంద్రం ఇంచార్జీలు కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి పార్టీ ఎన్నికల అధికారి ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. శంకరపట్నం మండలంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో బూత్ అధ్యక్షుల ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజేందర్ మాట్లాడుతూ. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వము ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అండ్ దండలతో ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి పార్టీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు, బూత్ అధ్యక్షులు శక్తి కేంద్రం ఇన్చార్జులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామంలోని 107వ బూత్ అధ్యక్షుడిగా బొజ్జ కూమార్,112వ బూత్ అధ్యక్షుడిగా నాగవెల్లి జగదీష్, మొలంగూర్ 115 వ బూత్ అధ్యక్షుడిగా దాసారపు తిరుపతి,117 వ బూత్ అధ్యక్షుడిగా పొద్దుటూరి వెంకన్న, గద్దపాక,126 వ బూత్ అధ్యక్షుడిగా రెడ్డి రమణారెడ్డి, 127 వ అధ్యక్షుడిగా జంగ సతీష్ లను ఏకగ్రీవంగా సమావేశంలో ఎన్నుకున్నట్లు రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగ జైపాల్, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు నరెందర్, శక్తి కేంద్ర ఇన్చార్జులు దొంగల రాములు, రాసమల్ల శ్రీనివాస్ నాయకులు బొజ్జ సాయిప్రకాష్, బోడ తిరుపతి, తోట అనీల్ లతో పాటు ఆయా గ్రామాల బిజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో దళితులకు తీరని అన్యాయం...

- దళితుల భూములు తిరిగి ఇచ్చేయాలి...
- శాసనసభలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 19**



గత ప్రభుత్వములో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు తీరని అన్యాయం చేస్తూ,హరితహారం, క్రీడా ప్రాంగణాలు, స్మశాన వాటికల కోసం తీసుకున్న దళితుల భూములను తిరిగి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం శాసనసభ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేసి,గతంలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను హరితహారం, క్రీడా ప్రాంగణాలు, స్మశాన వాటికల నిర్మాణాల పేరిట తీసుకున్నారని,వాటన్నింటిని దళితులకు తిరిగి భూములు దళిత కుటుంబాలకు అందజేసి ప్రభుత్వం అండగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శాసనసభలో కోరారు. ఇచ్చిన భూములను ప్రజా అవసరాల పేరిట తిరిగి తీసుకోవడం వల్ల దళితులకు అన్యాయం జరిగిందని, పేద దళిత కుటుంబాలకు, ఆ భూములను తిరిగి ఇవ్వడం ద్వారా న్యాయం జరుగుతుందని, ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సభలో కోరారు.మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం చొక్కారావుపల్లిలో కొంతమంది రైతులకు సంబంధించిన పట్టా భూముల విషయంలో ధరణిలో జరిగిన తప్పిదాన్ని సవరించాలని, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వానికి విన్నవించారు. చొక్కారావుపల్లెలో కొంత మంది రైతులు 1958 నుంచి పట్టా భూములు కలిగి ఉన్నారని, సర్వే నెంబర్ లో 163 ఎకరాల పట్టా భూములు కాగా, ధరణిలో 153 ఎకరాలను ప్రొహిబిటెట్ గా చూపించిన విషయాన్ని సభా దృష్టికి తీసుకు వచ్చారు. ధరణిలో దొర్లిన తప్పిదం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని, అవసరాల నిమిత్తం ఆ భూములను విక్రయించలేకపోతున్నారన్నారు.ఈ సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసిన ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిలో దొర్లిన తప్పిదాలను వెంటనే సవరించి, చొక్కారావుపల్లె రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సత్యనారాయణ రెవెన్యూశాఖామంత్రిని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకు వస్తున్న భూమాత ను ధరణి మాదిరి కాకుండా చూడాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు.

# విద్యార్థలకు షీ టీం పై అవగాహన సదస్సు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, డిసెంబర్ 19.**



రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షి టీం ఇంచార్జ్ మల్లన్న ఆధ్వర్యంలో రామగిరి మండల్ బేగంపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని వాటి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యుడు సురేష్, భరోసా టీమ్, హెడ్ మాస్టర్ యం. రాంకిషనరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.